క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవితం

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న డీఐజీ ఎల్ఎస్‌చౌహాన్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16: మనిషి ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయని డీఐజీ ఎల్ఎస్‌చౌహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్మించిన టెన్నిస్ కోర్టును మంగళవారం ఆయన కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మనిషి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలంటే వ్యాయామం ముఖ్యమని, అందులో ఆటలు ఉల్లాసం, ఉత్సాహాన్ని నింపడమే కాకుండా మనిషి ఫిట్‌నెస్‌ను పెంచుతాయన్నారు. క్రీడల పై ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కి మంచి అనుభవం ఉన్నందున టెన్నిస్ కోర్టు నిర్మించడం అభినందనీయమన్నారు. పోలీసు సిబ్బంది ప్రతినిత్యం టెన్నిస్ ఆడుతూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సై గోవర్ధన్, గౌస్‌పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

- మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం

కల్వకుర్తి, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు ఈనెల 18న గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని సమావేశాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం మంగళవారం ప్రకటనలో తెలిపారు. వెల్దండ మండలం కొట్ర గేట్ సమీపంలో శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై కేఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల ప్రచార సన్నాహక సమావేశానికి కేటీఆర్ హాజరవుతున్నారని ఆయన చెప్పారు. నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే అధ్యక్షతన జరగనున్న సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొంటారని ఆయన చెప్పారు. ప్రచార సన్నాహక సమావేశానికి నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

నెగ్గిన అవిశ్వాసం

ఓటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ కూచకుళ్ల

కొల్లాపూర్, ఏప్రిల్ 16 : కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గింది. మంత్రి జూపల్లి కృష్ణారావు తన పంతాన్ని నెగ్గించుకున్నారు. చైర్‌పర్సన్‌గా ఉన్న రఘుప్రోలు విజయలక్ష్మీచారిపై అవిశ్వాస తీర్మాణం పెట్టారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయ భవనంలో పోలీసుల పహారా మధ్య జరిగిన ఓటింగ్ నెగ్గింది. మొత్తం 20 కౌన్సిలర్లకుగానూ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గానికి చెందిన 15 మంది కౌన్సిలర్లతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కూచకుళ్ల దామోదర్‌రెడ్డి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి (బీఆర్ఎస్) వర్గీయులు, ఐదు మంది కౌన్సిలర్లు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. దీంతో విజయలక్ష్మీచారిపై అవిశ్వాసం నెగ్గినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శ్రీను, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తెలిపారు. కలెక్టర్ నుంచి ఉత్తర్వు వచ్చిన అనంతరం కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ఉంటుందని చెప్పారు.

29న జాతీయ సదస్సు

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

పాలమూరు, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారతదేశ మత్స్యసాగు సుస్థిర అభివృద్ధికి ఆవిష్కరణలు, క్రయవిక్రయాలపై ఈనెల 29న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మత్స్య పరిశ్రమకు దేశ ఆర్థిక వ్యవస్థను పెంపొందించేందుకు దీర్ఘకాలిక, సుస్థిరమైన పరిశ్రమలను స్థాపించడానికి సెమినార్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి స్వాతి, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

పేదల ఆకలి తీరుస్తున్న అంబలికేంద్రం

- అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

అంబలి పోస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్

అచ్చంపేట, ఏప్రిల్ 16: వేసవిలో అంబలి కేంద్రాలు పేదల ఆకలి తీరుస్తున్నాయని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంబలి కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు సొసైటీ ఏర్పాటు చేసుకొని సమాజానికి తమవంతు సేవలందించడం అభినందనీయమన్నారు. సొసైటీకి మున్సిపాలిటీ నుంచి కావాల్సిన సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే దాతలు ముందుకొచ్చి అంబలి కేంద్రాల నిర్వహణకు సహకారం అందించి మహిళలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు వెంకటేశ్వరశర్మ, కౌన్సిలర్ శివ, సొసైటీ అధ్యక్షురాలు జయమ్మ, పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలుశిక్ష

లింగాల, ఏప్రిల్ 16: డ్రంకెన్‌డ్రవ్ కేసులో వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించిన ట్లు ఎస్సై జగన్‌మోహన్ మంగళవారం తెలిపారు. మండలకేంద్రం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా తెల్కపల్లి మండలం పెద్దూర్‌కు చెందిన సిద్ధార్థరెడ్డి మద్యం తాగి పట్టుబడడంతో పాటు పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడంతో అదుపులో తీసుకొని అచ్చంపేట మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రెండురోజుల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆగిఉన్న ఆటోను ఢీకొన్న ద్విచక్రవాహనం..

- వ్యక్తికి తీవ్రగాయాలు

కోడేరు ఏప్రిల్ 16: ఆగిఉన్న ఆటోను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయలైన ఘటన కోడేరు మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కోడేరు మండల కేంద్రానికి చెందిన కుమ్మరి కురుమయ్య రాత్రి 9:30 గంటలకు ద్విచక్రవాహనంపై బీసీ కాలనీకి వెళ్లి తిరిగి వస్తుండగా అదుపు తప్పి కోమటి బాలరాజు ఇంటి ముందు ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కురుమయ్య తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి ప్రథమచికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

ప్రమాదాలను ఆపేదెలా?

- డేంజర్ జోన్‌గా మారిన తాండ్ర గేట్
- జాతీయ రహదారిపై యాక్సిడెంట్ల నివారణకు బారికేడ్ల ఏర్పాటు
- మరింత పెరిగిన ప్రమాదాల శాతం
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న ప్రజలు

వాహనం ఢీ కొట్టడంతో రోడ్డుపక్కన పడిపోయిన బారికేడ్

తాండ్ర గేట్ వద్ద ఎన్‌హెచ్‌పై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు(ఫైల్)

కల్వకుర్తి, ఏప్రిల్ 16 : పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఉన్న చోట ప్రమాదాల నివారణకు సాధారణంగా బారికేడ్లను వినియోగిస్తుంటారు. కానీ జాతీయ రహదారిపై గంటకు 80కి.మీ.కు పైగా వేగంతో వెళ్లే వాహనాలను బారికేడ్లతో నియంత్రించడం సాధ్యం కాకపోగా కొత్త ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లు వుతుంది. ఇలాంటి ఘటనే తాండ్ర గేట్ వద్ద చోటుచేసుకున్నది.

వివరాల్లోకి వెళ్తే..

కల్వకుర్తి మండలం తాండ్ర గేట్ వద్ద కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 10 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా 10 రోజుల కిందట తాండ్రకు చెందిన ప్రభుత్వ టీచర్ కూడా ఇక్కడే రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఎన్‌హెచ్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును నిర్మించడం వల్లనే ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు వివరించినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డేంజర్ జోన్‌గా తాండ్రగేట్..

తాండ్ర గేట్ నుంచి కొండారెడ్డిపల్లి గేట్(ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఊరు) వరకు జాతీయ రహదారి డేంజర్ జోన్‌గా మారింది. ఈ రోడ్డుపైకి రాగానే వాహన చోదకులకు ఒక రకమైన భయం కలుగుతున్నది. ఈ రోడ్డుపై వాహనాలు గంటకు 80కి లోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోతుంటాయి. ఇక్కడ ఎగుడు దిగుడుగా ఉన్న రోడ్డును సరిచేయకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించట్లేదు. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

శాశ్వత పరిష్కారం చూపకుండా..

తాండ్ర గేట్ వద్ద ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపకుండా ఎత్తుతో కూడిన స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాల నివారణ సంగతి దేవుడెరుగు.. కొత్త ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంతకుముందు ఇక్కడ ఎత్తుతో కూడిన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుగుకు అవి కనిపించక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో వాటిని తొలగించారు. 10 రోజుల కిందట బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో నాలుగు రోజుల కిందట ఎదురుగా వచ్చే వాహన లైట్ల వెలుగుకు బారికేడ్లు కనిపించని ద్విచక్ర వాహనదారుడు నేరుగా వెళ్లి దానిని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. మరో భారీ వాహనం నేరుగా బారికేడ్లను ఢీకొట్టడంతో అవి ఎగిరి దూరంగా పడిపోయాయి. దీంతో బారికేడ్ల కథ మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది.

శాశ్వత పనులు చేపట్టాల్సిందే..

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రోడ్డుపై ప్రమాదాల నివారణకు శాశ్వతమైన పనులు చేపట్టాలని తాండ్ర గ్రామస్తులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా తాండ్రకు చెందిన పొలాలున్నాయి. తరచుగా రైతులు అటుగా వెళ్తూ ఉంటారు. ఈక్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. రోడ్డు ఎత్తును తగ్గించడం, డివైడర్లు ఏర్పాటు చేసి వాటిపై హైమాస్టు లైట్లను ఏర్పాటు చేయడం మినహా మరో మార్గం లేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా తాత్కాలిక పనులను పక్కనబెట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు శాశ్వత మార్గం చూపేలా నియోజకవర్గ ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తేవాలని తాండ్ర వాసులు కోరుతున్నారు.

వైభవంగా మాస కల్యాణం

భక్తులకు తాళిని చూయిస్తున్న అర్చకుడు

చారకొండ, ఏప్రిల్ 16 : శిరుసనగండ్ల సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల మాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కల్యాణ మండపంలో పండితుల వేదమంత్రాలు, భాజాభజంత్రీల నడుమ సీతారాముల మాస కల్యాణం చూడముచ్చటగా జరిగింది. ఈ వేడుకను తిలకించేందుకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. వేడుకలో మాజీ జెడ్పీటీసీలు వెంకట్‌గౌడ్, భీముడునాయక్‌తో పాటు ఎంపీటీసీ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డిలు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామశర్మ, ఇంఛార్జి ఈవో శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ నిరంజన్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, డీటీ విద్యాధరి, నాయకులు పాల్గొన్నారు. కాగా నేడు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడిపాలమూరు, రంగారెడ్డి, నల్గొండ తదితర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు.

జానపద కళాకారుల మండల కమిటీ ఎన్నిక

కొల్లాపూర్, ఏప్రిల్ 16: జానపద కళాకారుల సంఘం మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని రామాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, కళాకారిణి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా తిప్పరాజుల నర్సింహ, ఉపాధ్యక్షులుగా మొట్టె నర్సింహ, ఆవుట స్వామి, కర్నె నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా బిజ్జ వేణు, సహాయ కార్యదర్శులుగా గుగ్గిల రమేశ్, మద్దెల రామచంద్రం, కోశాధికారిగా కలమంద చెన్నయ్య, ప్రచార కార్యదర్శులుగా పూజారి కృష్ణయ్య, నార్లాపూర్ సత్యనారాయణ, కలమంద నర్సింహ, సలహదారులుగా బండి ఆనంద్, మన్నె శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర జానపద కళాకారుల సంఘం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు తిప్పరాజుల నర్సింహకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల జానపద కళాకారులు పాల్గొన్నారు.

ఆర్ఎస్సై కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 16: మండలంలోని పీఎన్ లక్ష్మాపూర్‌కు చెందిన ఆర్ఎస్సై బాలీశ్వరయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏపీఏస్పీ 1995 బ్యాచ్‌కు చెందిన బాలీశ్వరయ్య సహా ఉద్యోగులు సోమవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.1 లక్ష ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య పి.శారధకు అందజేశారు. భవిష్యత్‌లో బాలీశ్వర్ కుటుంబానికి చేయుతనందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సహ ఉద్యోగులు సుజిత్ రెడ్డి, ఈశ్వర్ నాయక్, జైపాల్ రెడ్డి, దేవేందర్, బాలరాజు, పాండు, ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పదేండ్లలో భారాస చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి

- మార్నింగ్‌వాక్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మార్నింగ్‌వాక్‌లో వాలీబాల్ ఆటగాళ్లతో మాట్లాడుతున్న ఆర్ఎస్పీ

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16: రాష్ట్రంలో కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చూసి భారాసను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భారత రాష్ట్ర సమితి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్‌ప్రవీణ్‌కు మార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జెడ్పీమైదానంలో మార్నింగ్‌గ్ వా క్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కొద్దిసేపు వాకర్లతో కలిసి వాకింగ్, వ్యాయామం చేశారు. వా లీబాల్ ఆడారు. బస్టాండ్ సమీపంలోని ఫుట్‌పాత్‌లో కార్యకర్తలతో టీ తాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రుగ్యారెంటీల పేరుతో ప్రజలకు ఆచరణ సా ధ్యం కానీ అబద్ధపు హామీలిచ్చిన కాంగ్రెస్, అ ధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను పూ ర్తిగా విస్మరించి, నయవంచన చేసిందని విమర్శించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ రస్తాలో హమాలీ సంఘం నాయకులతో కలిసి రైతుబజార్ మార్కెట్లోని వర్తక వాణిజ్య సముదాయాల్లో ప్రచారం నిర్వహించి, కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనవెంట ఎంపీటీసీ విజయ్, సీనియర్ నాయకులు భాస్కర్‌గౌడ్, గంగాధర్, వెంకట్రాములు, పాల్గొన్నారు. కాగా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మావతి భర్త బీఆర్ఎస్ నాయకుడు బంగారయ్యను ఆర్ఎస్పీ పరామర్శించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

కబడ్డీ క్రీడాకారులతో ఆడుతున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16: క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దముద్దునూర్‌లో శ్రీ రామనవమి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన కబడ్డీ, ఎద్దులు బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృషభరాజుల బండలాగుడు పోటీలు మన సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తు చేస్తున్నాయన్నారు. అదేవిధంగా యువతలోని నైపుణ్యాన్ని గుర్తించేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణారావు, మాజీ సర్పంచ్ స్వామి, కౌన్సిలర్ నిజాం, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగాజిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మహమ్మద్‌గౌస్‌ను మంగళవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ కొత్తకావాలి శ్రీనివాసులు, నాయకులు తదితరులు ఉన్నారు.

కోడేరులో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత

- అత్యల్పంగా పదరలో 37.7 డిగ్రీలు
- భానుడి భగభగతో ఉక్కిరి బిక్కిరి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16: కందనూలు జిల్లాలో రోజు రోజుకూ ఎండలు ముదురుతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పల్లె, పట్టణ ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. వడగాల్పులతో ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. జిల్లాలో మంగళవారం అత్యధికంగా కోడేరులో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా అత్యల్పంగా 37.7 డిగ్రీల ఉష్ణోగ్రత పదరగ్రామంలో నమోదైంది. అచ్చంపేటలో 40 డిగ్రీలకు పైగా నమోదు కాగా, నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో 40.2 , పెంట్లవెల్లి మండలం జటప్రోలులో 40.4, పెద్దకొత్తపల్లి 40.6, కల్వకుర్తి 40.8, పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లిలో 40.9, అచ్చంపేట మండలం ఐనోలు 41.0, బిజినేపల్లిలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. రెండు రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసినా ఏమాత్రం ఉపశమనం పొందలేక పోయామని జిల్లా ప్రజలు అంటున్నారు.

కూలీలకు కనీస వసతులు కల్పించాలి

బిజినేపల్లిలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణాజీ

బిజినేపల్లి, ఏప్రిల్ 16: ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణాజీ అన్నారు. మంగళవారం మండలంలోని వసంతాపురంలో కొనసాగుతున్న ఉపాధిపనుల వద్ద ఆయన కూలీలను కలిసి మాట్లాడారు.

చారకొండలో..

చారకొండ, ఏప్రిల్ 16: ఉపాధిహా మీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ అ న్నారు. మంగళవారం మండ ల కేంద్రంలో ఉపాధి పనులు పరిశీలించి మాట్లాడారు.

తాడూరులో..

తాడూరు, ఏప్రిల్ 16 : ఎండలు ముదరకముందే పనులు ముగించుకొని త్వరగా ఇం టికి తి రిగివెళ్లాలని ఎంపీడీవో జ్యోతి పరోసియా కూలీలకు సూచించారు. మంగళవారం ఆమె పాపగల్, సిర్సవాడలో కూలీలతో మ ఆట్లాడారు.

బల్మూరులో

బల్మూరు, ఏప్రిల్16: కూలీలకు రోజుకూలి రూ.600 చెల్లించాలని గిరిజన సంఘం నాయకుడు శంకర్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల ంలోని వివిధ గ్రామాల్లో కూలీలతో సమ స్యలను అడిగి తెలుసుకున్నారు.

సలేశ్వరం వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా అటవీశాఖాధికారి రోహిత్ గోపిడి

సలేశ్వరం జాతర ఏర్పాట్ల గురించి వివరిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి రోహిత్ గోపిడి

అమ్రాబాద్, ఏప్రిల్ 16: సలేశ్వరం జాతరకు వెళ్లే భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి అన్నారు. మంగళవారం మండలంలోని మన్ననూర్ అటవీశాఖ కార్యాలయంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే సలేశ్వరం జాతరపై అధికారులు, భద్రతా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఫరహాబాద్ నుంచి లోపలికి ప్రవేశం ఉంటుందన్నారు. భక్తులు ప్లాస్టిక్ వస్తువులు వెంట తెచ్చుకోరాదని, ఎండలుఎక్కువగా ఉన్నందున భక్తులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గుండంవద్ద భక్తులు స్నానాలు ఆచరించి దైవ దర్శనానికి వెళ్లేందుకు అధికారులు తగినచర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రివేళ మార్గమధ్యలో సోలార్ లైట్లు అమర్చాలని, అత్యవసర పరిస్థితిలో వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాన్నారు. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ యాత్రను సంతోషంగా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి ఆదిత్య, అటవీశాఖ అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వివిధ కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16: మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి, ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన యువకుడికి ఒకరోజు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడ్డ గగ్గలపల్లికి చెందిన మల్లేశ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రామయ్య ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించినట్లు ఎస్పీ వెల్లడించారు. అదేవిధంగా బస్టాండ్ ప్రాంతంలో అమ్మాయిలపై దురుసుగా ప్రవర్తిస్తున్న మండలంలోని తూడుకుర్తికి చెందిన శేఖర్‌రె షీటీంకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుచగా జడ్జిఒకరోజు జైలుశిక్షతోపాటు వెయ్యి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కాగా ఎస్సై గోవర్ధన్‌ను ఎస్పీ అభినందించారు. మద్యంతాగి వాహనాలు నడిపినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా కఠినచర్యలు ఉంటాయని, జైలు శిక్షతప్పదని ఆయన హెచ్చరించారు.

గుడిసె దగ్ధం

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 16: మండలంలోని సిద్దాపూర్‌లో గుడిసె దగ్ధమైన ఘటన చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన వెంకటయ్య దంపతులు మంగళవారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో గుడిసే పూర్తిగా దగ్ధమై దుస్తులు, బియ్యం, నిత్యవసర సరుకులు, వంట సామగ్రి కాలిబూడిదై దాదాపు రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వెంకటయ్య తెలిపారు. కాగా బాధితుడుని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయమై తాసీల్దార్ మురళీమోహన్ వివరణ కోరగా ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షలు అందజేత

లింగాల, ఏప్రిల్ 16: అడవి పందిదాడిలో మృతి చెందిన వ్యక్తి కుటు